

ఆదివారం రాత్రి న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం అనంతరం కేంద్ర మంత్రివర్గ సభ్యులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్

72 మందితో క్యాబినెట్

మొదటిపేజీ తరువాయి...

క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. గత మంత్రివర్గంలో కీలక శాఖ బాధ్యతలు నిర్వర్తించిన రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, ఎస్ జైశంకర్ తదితరులు మరోసారి మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. రాజ్యసభ సభ్యులుగా ఉండి గత మంత్రివర్గంలో కొనసాగిన పీయూష్ గోయల్, జ్యోతిరాదిత్య సింధియా, ధర్మేంద్ర ప్రధాన్, భూపేందర్ యాదవ్ ఈసారి లోక్‌సభ సభ్యులుగా మంత్రివర్గంలో చేరారు. కాగా, జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవిని చేపట్టిన వ్యక్తిగా నరేంద్ర మోదీ నిలిచారు. తెలంగాణ నుంచి కిషన్ రెడ్డికి మరోసారి మంత్రిగా అవకాశం లభించింది. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను సహాయ మంత్రిగా తీసుకున్నారు.

ఏ రాష్ట్రం నుంచి ఎంత మంది ?

మంత్రివర్గంలో ఉత్తరప్రదేశ్‌కు అత్యధిక ప్రాధాన్యం లభించింది. ప్రధాని సహా పది మంది ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారికి మంత్రివర్గంలో చోటు లభించింది. ఆ తర్వాత బీహార్ నుంచి ఎనిమిది మంది, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ నుంచి ఐదుగురు చొప్పున, మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి నలుగురు చొప్పున, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు చొప్పున, పశ్చిమ బెంగాల్, హర్యానా, తెలంగాణ, అస్సాం, జార్ఖండ్ నుంచి ఇద్దరు చొప్పున చోటు దక్కించుకున్నారు. పంజాబ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, అరుణాచల్ ప్రదేశ్, గోవా, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ నుంచి ఒక్కొక్కరికి చొప్పున చోటు లభించింది.

మోదీకి కేటీఆర్, హరీశ్ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్రమోదీకి, తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా పదవీ ప్రమాణం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు ఇతర మంత్రివర్గ సభ్యులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్‌వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. విజయవంతంగా ఎన్డీయే ప్రభుత్వం కొనసాగుతూ ప్రజలకు మేలు చేయాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని హరీశ్‌రావు అభిలషించారు. తెలంగాణ అభివృద్ధికి దోహదపడే రీతిలో ప్రాజెక్టులు తెస్తూ, రాష్ట్రానికి అధిక నిధులు వచ్చేలా కృషిచేయాలని కోరారు.

మోదీ 3.0 క్యాబినెట్‌లో ఎవరికి ఏ శాఖ?

పేరు	శాఖ
నరేంద్ర మోదీ	ప్రధాని, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణుశక్తి, అంతరిక్ష, ఇతర కీలక విధానపరమైన అంశాలు
రాజ్‌నాథ్ సింగ్	రక్షణ
అమిత్ షా	హోం, సహకార
నితిన్ గడ్కరీ	రోడ్డు రవాణా, హైవేలు
జగత్ ప్రకాశ్ నడ్డా	ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువులు
శివరాజ్ సింగ్ చౌహాన్	వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి
నిర్మలా సీతారామన్	ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాలు
డాక్టర్ ఎస్ జైశంకర్	విదేశీ వ్యవహారాలు
మనోహర్‌లాల్ ఖట్టర్	విద్యుత్, గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి
హెచ్‌డీ కుమారస్వామి	భారీ పరిశ్రమలు, ఉక్కు
పీయూశ్ గోయల్	వాణిజ్యం, పరిశ్రమలు, వస్త్రాలు
ధర్మేంద్ర ప్రధాన్	విద్య, నైపుణ్యాభివృద్ధి
జితన్‌రామ్ మాంఝీ	సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు
రాజీవ్ రంజన్ సింగ్(లల్లన్)	పంచాయతీరాజ్, మత్స్య, పశుసంవర్ధక
సర్బానంద సోనోవాల్	ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలు
డాక్టర్ వీరేంద్ర కుమార్	మహిళా, శిశు అభివృద్ధి, సామాజిక న్యాయం
కే రామ్మోహన్ నాయుడు	పౌర విమానయానం
ప్రహ్లాద్ జోషి	పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనులు
అశ్వినీ వైష్ణవ్	రైల్వేలు, సమాచార, ప్రసార, ఐటీ
గిరిరాజ్ సింగ్	వస్త్రాలు
జ్యోతిరాదిత్య సింధియా	పౌర విమానయానం
భూపేంద్ర యాదవ్	పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు, కార్మిక, ఉపాధి
గజేంద్ర సింగ్ షెకావత్	పర్యాటక, సాంస్కృతిక
అన్నపూర్ణ దేవి	మహిళా, శిశు అభివృద్ధి
కిరణ్ రిజిజు	పార్లమెంటరీ వ్యవహారాలు
మన్‌సుఖ్ మాండవీయ	రసాయనాలు, ఎరువులు
హర్‌దీప్ సింగ్ పురి	పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ
గంగాపురం కిషన్ రెడ్డి	సాంస్కృతిక, పర్యాటక
చిరాగ్ పాశ్వాన్	ఆహార శుద్ధి
సీఆర్ పాటిల్	జలశక్తి

ఏపీ నుంచి ముగ్గురు

ఆంధ్రప్రదేశ్ నుంచి టీడీపీకి చెందిన ఇద్దరికి, బీజేపీ ఎంపీ ఒకరికి మంత్రివర్గంలో చోటు లభించింది. శ్రీకాకుళంలో వరుసగా మూడోసారి గెలిచిన టీడీపీ ఎంపీ కింజారపు రామ్మోహన్ నాయుడుకు మంత్రిగా అవకాశం దక్కింది. గుంటూరు నుంచి మొదటిసారి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు సహాయమంత్రిగా చోటు దక్కింది. నర్సాపురం ఎంపీగా మొదటిసారి గెలిచిన భూపతిరాజు శ్రీనివాస వర్మ(బీజేపీ)కి కూడా సహాయమంత్రిగా అవకాశం కల్పించారు. కాగా, లోక్‌సభ సభ్యుల్లోనే కాక కేంద్ర మంత్రివర్గంలో కూడా అత్యంత ధనికుడిగా పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచారు. ఆయన తన కుటుంబానికి రూ.5,785.28 కోట్ల ఆస్తి ఉన్నట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో చూపిన సంగతి తెలిసిందే.

ఏడుగురు మహిళలకు ఛాన్స్

మోదీ గత క్యాబినెట్‌లో 10 మంది మహిళలు ఉండగా ఈసారి మాత్రం ఏడుగురికే అవకాశం లభించింది. కేంద్ర మంత్రులుగా నిర్మలా సీతారామన్, అన్నపూర్ణ దేవీ, సహాయ మంత్రులుగా శోభా కరంద్లాజే, రక్ష ఖడ్సే, సావిత్రీ ఠాకూర్, నిముబెన్ బంభానియా, అనుప్రియా పటేల్ ప్రమాణస్వీకారం చేశారు. మాజీ మంత్రి స్మృతి ఇరానీ, కేంద్ర మాజీ సహాయ మంత్రులు డాక్టర్ భారతి పవార్, సాధ్వీ నిరంజన్ జ్యోతి, దర్శన జర్దోశ్, మీనాక్షి లేఖి, ప్రతిమా భౌమిక్‌కు ఈసారి అవకాశం దొరకలేదు.

కూటమి పార్టీలకు ప్రాధాన్యం

కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఒంటరిగా మెజారిటీ దక్కని నేపథ్యంలో ఎన్డీయే భాగస్వామ్య పార్టీలపై బీజేపీ ఆధారపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రివర్గంలో కూడా ఈసారి మిత్రపక్షాలకు ప్రాధాన్యత ఇచ్చింది. గత క్యాబినెట్‌లో ఒక్కరికి కూడా కేంద్ర మంత్రిగా అవకాశం దక్కలేదు. కేవలం సహాయ మంత్రి పదవులను మాత్రమే బీజేపీ ఇచ్చింది. ఈసారి మాత్రం 30 మంది క్యాబినెట్ మంత్రుల్లో ఐదుగురిని మిత్రపక్షాల నుంచి తీసుకున్నారు. జేడీఎస్, హెచ్‌ఏఎం(సెక్యులర్), జేడీయూ, టీడీపీ, ఎల్‌జేపీ(రామ్ విలాస్) పార్టీల నుంచి ఒక్కొక్కరిని మంత్రులుగా అవకాశం కల్పించారు. స్వతంత్ర హోదాతో సహాయ మంత్రులుగా శివసేన నుంచి ఒకరికి, ఆర్ఎల్‌డీ నుంచి ఒకరికి చోటిచ్చారు. సహాయ మంత్రులుగా ఆర్పీఐ, అప్నా దల్(ఎస్), టీడీపీ, జేడీయూ, వీఐపీ నుంచి ఒక్కొక్కరి చొప్పున అవకాశం ఇచ్చారు.

అట్టహాసంగా ప్రమాణస్వీకార వేడుక

కేంద్ర మంత్రివర్గ ప్రమాణస్వీకారం భారీ ఎత్తున జరిగింది. దాదాపు 9 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్(ప్రచండ), శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ మొయిజ్జు, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జగన్నాథ్, భూటాన్ ప్రధాని త్షెరింగ్ తోబ్గే, సీషెల్స్ ఉపాధ్యక్షుడు అహ్మద్ అఫీఫ్, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే భాగస్వామ్య పార్టీల నేతలు, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, నటులు షారూఖ్ ఖాన్, రజినీకాంత్, అక్షయ్ కుమార్, అనిల్ కపూర్, అనుపమ్ ఖేర్, రవీనా టాండన్, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఏడుగురు మాజీ సీఎంలకు చోటు

మోదీ ప్రభుత్వంలో కొత్తగా కొలువుదీరిన మంత్రివర్గంలో ప్రధాని మోదీతో కలుపుకుని ఏడుగురు మాజీ ముఖ్యమంత్రులకు స్థానం దక్కింది. వీరిలో బీజేపీకే చెందిన ఐదుగురు, మిత్రపక్షాలకు చెందిన ఇద్దరు ఉన్నారు. కమలం పార్టీకి చెందిన మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, హర్యానా మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్, యూపీ మాజీ సీఎం రాజ్‌నాథ్ సింగ్, అస్సాం మాజీ సీఎం సర్బానంద సోనోవాల్‌లకు కేంద్ర క్యాబినెట్‌లో స్థానం దక్కింది. అలాగే ఎన్డీయే పక్ష పార్టీల నుంచి బీహార్ మాజీ సీఎం జితన్ రామ్ మాంఝీ, కర్ణాటకకు చెందిన మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఉన్నారు.

33 మంది కొత్తవారే

ఈసారి క్యాబినెట్‌లో 33 మంది కొత్త వారికి చోటు దక్కింది. 30 మంది మంత్రుల్లో ఏడుగురు కొత్త వారు. కాగా, కేంద్ర క్యాబినెట్‌లోకి 81 మందిని తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే, ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీతో సహా మొత్తం 72 మంది కేంద్ర మంత్రివర్గంలో ఉన్నారు. మరో తొమ్మిది మందిని క్యాబినెట్‌లోకి తీసుకోవడానికి అవకాశం ఉంది. క్యాబినెట్ విస్తరణ జరిపి ఈ పదవులను కూడా భర్తీ చేస్తారా లేదా అనేది చూడాల్సి ఉంది. అయితే, గత క్యాబినెట్‌లో 78 మంది సభ్యులుగా ఉన్నారు.

ఒక్క ముస్లిం లేని కేంద్ర క్యాబినెట్

మోదీ నేతృత్వంలో కేంద్రంలో కొత్తగా ఏర్పాటైన మంత్రివర్గంలో ఓబీసీలు 27 మంది ఉన్నారు. జనరల్ క్యాటగిరీ నుంచి 25 మంది, ఎస్సీలు 10 మంది, ఎస్టీలు ఐదుగురు, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన్ మతాలకు చెందిన ఐదుగురికి క్యాబినెట్‌లో చోటు దక్కింది. కాగా, మోదీ మంత్రివర్గంలో ఒక్క ముస్లిం కూడా లేకపోవడం గమనార్హం.

బీజేపీకి కొత్త అధ్యక్షుడు?

న్యూఢిల్లీ, జూన్ 9: కేంద్రంలో కొత్తగా ఏర్పాటైన మంత్రివర్గంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చేరడంతో ఆ పార్టీకి త్వరలో కొత్త చీఫ్ రానున్నట్టు తెలుస్తున్నది. 'ఒక వ్యక్తి, ఒక పదవి' అనే బీజేపీ పాలసీలో భాగంగా పార్టీ అధ్యక్ష బాధ్యతలను నడ్డా నుంచి మరొకరికి అప్పగించే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. 2019 మేలో లోక్‌సభ ఎన్నికల తర్వాత అమిత్‌షా కేంద్ర హోంమంత్రి అయిన తర్వాత 2020లో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నడ్డా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆయన నాయకత్వంలోనే బీజేపీ తాజా లోక్‌సభ ఎన్నికలకు వెళ్లింది. అంతకు ముందు అమిత్‌షా నాయకత్వంలో బీజేపీ 2014, 2019 ఎన్నికల బరిలోకి దిగింది.

మండి ఎంపీ కంగనా రనౌత్‌ను చెంప దెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్‌కు మద్దతుగా ఎస్కేఎం(రాజకీయేతర), కేఎంఎం తదితర రైతు సంఘాలు ఆదివారం పంజాబ్‌లోని మొహాలీలో ర్యాలీ నిర్వహించాయి.

కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధం

శ్రీనగర్, జూన్ 9: జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ కసరత్తు ప్రారంభించింది. ఈ నెలలోనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ఆగస్టులో ఎన్నికలు పూర్తి చేయాలనే ఆలోచనతో ఈసీ ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎన్నికలు నిర్వహించేందుకు వాతావరణ పరిస్థితులు అంతగా అనుకూలంగా ఉండవు. అయితే, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్ ప్రజలు ఓట్లు వేసేందుకు ఉత్సాహం చూపారు. కశ్మీర్ వ్యాలీలో 51.05 ఓటింగ్ శాతం నమోదైంది. గత మూడునాలుగు దశాబ్దాల్లో ఈసారే కశ్మీర్‌లో ఎన్నికలు అత్యంత ప్రశాంతంగా జరిగాయి. ప్రజలు ఓటింగ్‌కు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఎన్నికలు ఇప్పుడే నిర్వహించాలని ఈసీ భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే గుర్తింపు పొందని రిజిస్టర్డ్ పార్టీలు ఎన్నికల గుర్తులకు దరఖాస్తు చేసుకోవాలని ఈసీ ఆహ్వానించింది. కాగా, గతంలో జమ్ము కశ్మీర్ అసెంబ్లీలో 107 స్థానాలు ఉండగా ఇప్పుడు 114కు పెరిగాయి. వీటిలో 24 సీట్లు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉండగా మిగతా 90 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిల్లో జమ్ము ప్రాంతంలో 43 స్థానాలు, కశ్మీర్ వ్యాలీలో 47 స్థానాలు ఉన్నాయి.

నేడు క్యాబినెట్ భేటీ

న్యూఢిల్లీ: కొత్తగా ఏర్పాటైన నరేంద్ర మోదీ క్యాబినెట్ తొలి సమావేశం సోమవారం జరగనుంది. సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని లోక్‌కళ్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసంలో క్యాబినెట్ సమావేశం ఉంటుంది.

ప్రతి ఆరుగురిలో ఒకరు రాజ్యసభ సభ్యులే

న్యూఢిల్లీ, జూన్ 9: కొత్తగా కొలువైన మోదీ కొత్త క్యాబినెట్ మంత్రుల్లోని ప్రతి ఆరుగురిలో ఒకరు రాజ్యసభ సభ్యులే. క్యాబినెట్‌లో మొత్తం 12 మంది ఎగువ సభ సభ్యులు. అలాగే 58 మంది తొలిసారి లోక్‌సభకు ఎన్నికైన సభ్యులు. సహాయ మంత్రులు రవనీత్ సింగ్ బిట్టు, జార్జి కురియన్‌లు అటు లోక్‌సభలో కానీ, ఇటు రాజ్యసభలో కానీ సభ్యులు కారు.

ఎన్సీపీ అజిత్ వర్గానికి దక్కని క్యాబినెట్ బెర్త్!

న్యూఢిల్లీ: కేంద్రంలో మూడోసారి అధికారాన్ని చేపట్టిన ఎన్డీయే సర్కార్, ఎన్సీపీ (అజిత్‌పవార్) వర్గానికి షాకిచ్చింది. క్యాబినెట్ హోదా కలిగిన కేంద్రమంత్రి పదవి ఇవ్వాలన్న ఆ పార్టీ డిమాండ్‌ను తోసిపుచ్చింది. క్యాబినెట్‌లో బెర్త్ లభించటంపై మరికొద్ది రోజులు వేచి చూస్తామని అజిత్ పవార్ పేర్కొన్నారు. స్వతంత్ర హోదాతో కూడిన సహాయ మంత్రి పదవి ఇస్తామని బీజేపీ నుంచి వచ్చిన అజిత్ వర్గం తిరస్కరించింది. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. కేవలం ఒకే ఒక స్థానంలో గెలుపొందింది.

రాజకీయాలకు పాండియన్ గుడ్‌బై

- ఎన్నికల్లో ఓటమికి తాను కారణమనుకుంటే క్షమించాలని కోరిన మాజీ ఐఏఎస్ అధికారి

భువనేశ్వర్: ఒడిశా రాజకీయాల్లో ఇటీవల కీలక పాత్ర పోషించిన మాజీ ఐఏఎస్ అధికారి వీకే పాండియన్ రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. ఒడిశాలో అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిపాల వడంతో నైతిక బాధ్యతగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐఏఎస్ అధికార పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన ఆరు నెలల 13 రోజులకు ఆయన క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ఆదివారం ప్రకటించారు. తనను ఎంతో ఆదరించిన ఒడిశాను, గురువు నవీన్ బాబును గుండెల్లో ఉంచుకుంటానని ఆయన పేర్కొన్నారు. మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌కు సహాయ పడటానికి మాత్రమే తాను రాజకీయాల్లోకి వచ్చానని, అందుకే తాను 2024 ఎన్నికల్లో పోటీ కూడా చేయలేదని, ఎలాంటి పదవులు చేపట్టలేదని ఆయన చెప్పారు. ఈ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా జరిగిన ప్రచారం కారణంగా బీజేడీ ఓడిందని భావిస్తే అందుకు కార్యకర్తలకు, ప్రజలకు క్షమాపణలు చెబుతున్నానన్నారు. అలాగే ఈ ప్రయాణంలో ఎవరినైనా నొప్పించి ఉంటే మన్నించాలని కోరారు. కాగా, 24 ఏండ్ల బీజేడీ పాలనకు బీజేపీ ఈ ఎన్నికల్లో పగ్గాలు వేసింది. 147 సీట్లలో 78 గెల్చుకుని తొలిసారి ఒడిశాలో అధికారం చేపట్టనుంది. కాగా, బీజేడీ 51 సీట్లకే పరిమితమై అధికారాన్ని కోల్పోయింది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఖాతా కూడా తెరవలేదు. నవీన్ పట్నాయక్ ఆరోసారి సీఎం కాకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని పాండియన్ ఎన్నికల ప్రచారంలో శపథం చేశారు. కాగా, ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన పాండియన్‌ను ఒక సమయంలో నవీన్ వారసుడిగా అందరూ పేర్కొన్నారు.

ఒడిశా కొత్త సీఎంగా సురేశ్ పుజారి?

- రేసులో పలువురు బీజేపీ సీనియర్లు
- కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం 10 నుంచి 12వ తేదీకి మార్పు

భువనేశ్వర్, జూన్ 9: ఒడిశా కొత్త సీఎం ఎవరవుతారనే దానిపై రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. బీజేపీ సీనియర్ నేత, కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన సురేశ్ పుజారి ముందు వరుసలో ఉన్నట్టు తెలుస్తున్నది.ఈ క్రమంలో ఆయన ఢిల్లీకి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. కేంద్ర నాయకత్వంతో చర్చల కోసం ఆయన హస్తినకు వెళ్లినట్టు మద్దతూరులు చెబుతున్నారు. ఇంకా సీఎం రేసులో బీజేపీ సీనియర్ నేతలు బైజయంత్ పాండా, అపరాజిత సారంగి, గిరీష్ ముర్ము తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. అయితే సీఎం పోస్టుకు అధినాయకత్వం ఇంకా ఎవరినీ ఎంపిక చేయలేదని, దీనిపై పార్టీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకోలేదని బీజేపీ ఒడిశా శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సమల్ శనివారం ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత అన్నారు. మరోవైపు ఈనెల 10కి బదులుగా 12న బీజేపీ సర్కార్ ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని ఆ పార్టీ నేతలు ఆదివారం వెల్లడించారు.

ఒకేసారి రన్‌వేపై రెండు విమానాలు

ముంబైలో తప్పిన పెనుప్రమాదం

ముంబై, జూన్ 9: ముంబై విమానాశ్రయంలో శనివారం పెను ప్రమాదం తప్పింది. నిమిషం కంటే తక్కువ వ్యవధిలో ఒకే రన్‌వేపై ఇండిగో విమానం ల్యాండ్ అవుతుండగా, ఎయిరిండియా విమానం టేకాఫ్ అయ్యింది. ఈ ఘటనపై విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ విచారణ చేపట్టింది. ఆ సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ ఏటీసీ)గా ఉన్న వ్యక్తిని విధుల నుంచి తొలగించింది. ఘటనపై ఇండిగో కూడా విచారణ చేపట్టింది. ఏటీసీ ఆదేశాల మేరకు తాము విమానాన్ని ల్యాండింగ్ చేశామని ఇండిగో తెలిపింది. నిబంధనల ప్రకారం దిగబోతున్న విమానానికి ఏటీసీ ల్యాండింగ్ అనుమతి ఇచ్చిన తర్వాతే బయల్దేరే విమానం రన్ వే చివరను క్రాస్ చేయాలి లేదా మలుపు తీసుకోవాలి. అయితే తాజా ఘటనలో ఈ నిబంధనను పాటించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి. ముంబై ఎయిర్‌పోర్ట్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉన్నప్పుడు ఏటీసీలపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది.

మహిళను 'పాట్టన' పెట్టుకున్న కొండచిలువ

జకార్తా, జూన్ 9: కనిపించకుండా పోయిన ఓ మహిళ ఒక రోజు తర్వాత ఒక కొండచిలువ పొట్టలో విగత జీవిగా కనిపించిన విషాద ఘటన ఇండోనేషియాలో జరిగింది. స్థానిక అధికారి శనివారం వెల్లడించిన వివరాల ప్రకారం దక్షిణ సులాసి ప్రావిన్స్‌లోని కలెంపాగ్ గ్రామానికి చెందిన ఫరీదా(45)ను శుక్రవారం ఆమె భర్త, స్థానికులు 5 మీటర్ల పొడవున్న ఒక కొండచిలువ కడుపులో కనుగొన్నారు. గురువారం రాత్రి నుంచి ఫరీదా కనిపించకపోవడంతో వెతుకులాట ప్రారంభించామని గ్రామాధిపతి మీడియాకు తెలిపారు. ఫరీదాకు చెందిన వస్తువులు దొరికిన ప్రాంతంలో వెతగ్గా.. పెద్ద కడుపుతో ఉన్న కొండచిలువ వారికి కనిపించింది. దాన్ని కోసి చూడగా వేసుకున్న దుస్తులతో సహా ఫరీదా వారికి కనిపించింది. ఇండోనేషియాలో ఏటా ఇలాంటి ఘటనలు ఒకటి, రెండు చోటు చేసుకోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నది.

రాజస్థాన్‌లోని హనుమాన్‌ఘర్ జిల్లా బుకారా గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంటె ఇలా కారులో ఇరుక్కుపోయింది. వాలా సమయం తర్వాత క్రేన్ సాయంతో దాన్ని కారు నుంచి బయటకు తీసి ప్రథమ చికిత్స చేశారు. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

37మంది తాజా మాజీలకు దక్కని చోటు

న్యూఢిల్లీ, జూన్ 9: మునుపటి మంత్రివర్గంలో పనిచేసిన చాలా మందికి తాజా మంత్రివర్గంలో చోటు దక్కలేదు. స్మృతి ఇరానీ, అనురాగ్ ఠాకూర్, అజయ్ మిశ్రా, నారాయణ రాణే, మీనాక్షి లేఖి, అజయ్ భట్ సహా దాదాపు 37 మంది కమలం పార్టీ నేతలను క్యాబినెట్ నుంచి తప్పించారు. వీరిలో కొంతమంది తాజా ఎన్నికల్లో ఓడిపోగా, మరి కొంత మంది పోటీచేయలేదు. కొందరు గెలిచినప్పటికీ క్యాబినెట్‌లోకి తీసుకోకపోవడం గమనార్హం. అజయ్ భట్, అనురాగ్ ఠాకూర్, నారాయణ్ రాణే వంటి వాళ్లు ఎన్నికల్లో గెలిచినప్పటికీ, వారికి మంత్రివర్గంలో మరోసారి బెర్త్ దక్కలేదు. గత ప్రభుత్వంలో కేంద్ర మంత్రులుగా చేసిన స్మృతి ఇరానీ, సాధ్వి నిరంజన్ జ్యోతి, ఆర్కే సింగ్, అర్జున్ ముండా, రాజీవ్ చంద్రశేఖర్, నితీశ్ ప్రామాణిక్, అజయ్ మిశ్రా, సుభాష్ సర్కార్, భారతి పవార్, కపిల్ పాటిల్ ఎన్నికల్లో ఓడిపోయారు. మీనాక్షి లేఖి, వీకే సింగ్ అశ్విని కుమార్ చౌబే అసలు ఎన్నికల్లోనే పోటీచేయలేదు.

కేంద్రమంత్రుల జాబితా

క్యాబినెట్ మంత్రులు

పేరు	పార్టీ	రాష్ట్రం
1. నరేంద్ర మోదీ (ప్రధాని)	బీజేపీ	ఉత్తరప్రదేశ్
2. రాజ్‌నాథ్ సింగ్	బీజేపీ	ఉత్తరప్రదేశ్
3. అమిత్ షా	బీజేపీ	గుజరాత్
4. నితిన్ గడ్కరీ	బీజేపీ	మహారాష్ట్ర
5. జగత్ ప్రకాశ్ నడ్డా	బీజేపీ	హిమాచల్ ప్రదేశ్
6. శివ్‌రాజ్ సింగ్ చౌహాన్	బీజేపీ	మధ్యప్రదేశ్
7. నిర్మలా సీతారామన్	బీజేపీ	కర్ణాటక
8. డాక్టర్ ఎస్ జైశంకర్	బీజేపీ	గుజరాత్
9. మనోహర్‌లాల్ ఖట్టర్	బీజేపీ	హర్యానా
10. హెచ్‌డీ కుమారస్వామి	జేడీఎస్	కర్ణాటక
11. పీయూశ్ గోయల్	బీజేపీ	మహారాష్ట్ర
12. ధర్మేంద్ర ప్రధాన్	బీజేపీ	ఒడిశా
13. జితన్‌రామ్ మాంఝీ	హెచ్ఏఎం	బీహార్
14. రాజీవ్ రంజన్ సింగ్(లల్లన్)	జేడీయూ	బీహార్
15. శర్బానంద సోనోవాల్	బీజేపీ	అస్సాం
16. కే రామ్మోహన్ నాయుడు	టీడీపీ	ఆంధ్రప్రదేశ్
17. డాక్టర్ వీరేంద్ర కుమార్	బీజేపీ	మధ్యప్రదేశ్
18. జుయెల్ ఓరమ్	బీజేపీ	ఒడిశా
19. ప్రహ్లాద్ జోషి	బీజేపీ	కర్ణాటక
20. అశ్వినీ వైష్ణవ్	బీజేపీ	ఒడిశా
21. గిరిరాజ్ సింగ్	బీజేపీ	బీహార్
22. జ్యోతిరాదిత్య సింధియా	బీజేపీ	మధ్యప్రదేశ్
23. భూపేంద్ర యాదవ్	బీజేపీ	రాజస్థాన్
24. గజేంద్ర సింగ్ షెకావత్	బీజేపీ	రాజస్థాన్
25. అన్నపూర్ణ దేవి	బీజేపీ	జార్ఖండ్
26. కిరణ్ రిజిజు	బీజేపీ	అరుణాచల్ ప్రదేశ్
27. మన్‌సుఖ్ మాండవీయ	బీజేపీ	గుజరాత్
28. హర్‌దీప్ సింగ్ పురి	బీజేపీ	ఉత్తరప్రదేశ్
29. గంగాపురం కిషన్ రెడ్డి	బీజేపీ	తెలంగాణ
30. చిరాగ్ పాశ్వాన్	ఎల్‌జేపీ-రామ్ విలాస్